నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 26 నవంబర్ 2024 | HYDERABAD


## ఆక్రమణల తొలగింపు



బహదూర్‌పల్లిలోని సర్వే నంబర్ .227లో ఏర్పాటు చేసిన కంటైనర్ డబ్బాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. కొన్ని రోజులుగా ఈ స్థలంలో అక్రమంగా కంటైనర్ డబ్బాలు, షెడ్లు వెలుస్తున్నాయంటూ మేడ్చల్ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. స్పందించిన ఆయన తక్షణమే ఆక్రమణలను తొలగించాలంటూ మండల రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సదరు నిర్మాణాలను తొలగించారు.

-దుండిగల్



జలమండలి ఎస్టీపీలను ఫ్రాన్స్ దేశానికి చెందిన బృందం సోమవారం సందర్శించింది. మూసీ రివర్ డెవలప్‌మెంట్ వర్క్‌షాపులో భాగంగా ఫ్రెంచ్ బృందం అత్తాపూర్ ఎస్టీపీని సందర్శించింది. వాటి పనితీరు, మురుగు నీటి శుద్ధి ప్రక్రియలో దశలు, అవలంబించే పద్ధతులు, ఉపయోగించే సాంకేతికత తదితర వివరాల గురించి జలమండలి జీఎం వాస సత్యనారాయణ ఆ బృందానికి వివరించారు. ఈ నెల 28న జలమండలిని విదేశీ బృందం సందర్శించనున్నది. -సిటీబ్యూరో



## బల్దియాకు 200 మంది జూనియర్ అసిస్టెంట్లు

సిటీబ్యూరో, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీకు కొత్తగా 200 మంది జూనియర్ అసిస్టెంట్లను నియమించనున్నారు. ఈ మేరకు సోమవారం 100 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తవ్వగా, మిగిలిన 100 మంది వెరిఫికేషన్ మంగళవారం పూర్తి కానున్నది. ఈ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి కాగానే జీహెచ్ఎంసీ అడ్మిన్ విభాగంలో వీరికి పోస్టింగ్ ఇవ్వనున్నారు.

## అస్కీలో రూ. 88.91 లక్షల నిధులు గోల్ మాల్

### మాజీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో పాటు మరో ఐదుగురిపై కేసు

సిటీబ్యూరో, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): వివిధ ఏజెన్సీ నిర్వాహకులతో కుమ్మక్కై నకిలీ ఇన్వాయిస్‌లతో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా(అస్కీ)కు చెందిన రూ. 88.91 లక్షలు గోల్‌మాల్ ఆరోపణలపై సీసీఎస్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు అస్కీ మాజీ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.లక్ష్మి, హైదరాబాద్, హర్యానాలకు చెందిన ఐదుగురు ఏజెన్సీ, కన్సల్టెన్సీల నిర్వాహకులను ఈ కేసులో నిందితులుగా పేర్కొన్నారు. వివిధ అంశాలకు చెందిన నైపుణ్యాలపై అస్కీ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తుంటారు. ఈ కేంద్రానికి అస్కీలో ప్రొఫెసర్‌గా పనిచేసి, పదవీ విరమణ పొందిన డాక్టర్ బి.లక్ష్మి ఎక్స్‌టెన్షన్‌పై ఈ ఏడాది ఆగస్టు 16 వరకు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలో రిసోర్స్ కేంద్రానికి కావాల్సిన వివిధ వస్తువులు కొనుగోళ్లకు వివిధ ఏజెన్సీ, కన్సల్టెన్సీల నిర్వాహకులైన హర్యానా గుర్గ్గావ్‌కు చెందిన షేక్ అభిషేక్ ఇమ్లాక్, హైదరాబాద్‌కు బల్లపు శృతి, నలమస రజనీ, ఎం.బుర్రయ్య, ధనలక్ష్మిల నుంచి ఇన్వాయిస్‌లు 2021 మార్చి నుంచి తీసుకున్నారు. ఈ ఇన్వాయిస్‌ల ప్రకారం వస్తువులు కొన్నట్లు, వారికి చెల్లింపులు చేసినట్లు రికార్డులు రాశారు. ఈ మేరకు మార్చి 2021 నుంచి ఈ ఏడాది ఆగస్టు 16వ తేదీ వరకు రూ. 88.91 లక్షలు చెల్లించారు. నిధుల గోల్‌మాల్‌తో పాటు ఇతర అంశాలపై ప్రాజెక్ట్ డైరెక్టర్‌పై ఆరోపణలు రావడంతో ఆమెను ఈ ఏడాది ఆగస్టులో తొలగించారు. ఆ తరువాత ఆమె హయాంలో జరిగిన లావాదేవీలపై ఏజెన్సీలు, కన్సల్టెన్సీలు, వెండర్స్ గురించి.. ఆరాతీసి అంతర్గత విచారణ జరిపారు. ఈ విచారణలో ఇన్వాయిస్‌లు రావడం, వాటికి బిల్లులు చెల్లించడం అంతా పక్కా ప్లాన్‌తో నిధులు గోల్‌మాల్ చేసేందుకు జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు ఈ వ్యవహారంపై పూర్తి దర్యాప్తు చేయాలని కోరుతూ అస్కీ పరిపాలన విభాగం అడ్మినిస్ట్రేటివ్ అధికారి జగదీశ్‌కుమార్ శనివారం సీసీఎస్ డీసీపీ శ్వేతకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



అంబర్‌పేట ప్రధాన రహదారిలో రోడ్డు పక్కన పేరుకుపోయిన వ్యర్థాలను ఎవరో కాలబెట్టడంతో విపరీతంగా పొగ వ్యాపించింది. దీంతో అటు వాహనదారులు ఇటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అసలే నగరంలో కాలుష్యం విజృంభిస్తుండగా, చెత్తను ఇలా తగలబెట్టడం వల్ల మరిన్ని ఇబ్బందులు వస్తాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## అంకిరెడ్డిపల్లి కబ్జాలపై తేల్చండి

### డిప్యూటీ డైరెక్టర్ సర్వే ల్యాండ్‌కు సర్కారు ఆదేశాలు

### సాల్వో ఇండస్ట్రీస్ అక్రమ నిర్మాణాలు..

### మైనింగ్ పనులపై విచారణకు సిద్ధమవుతున్న అధికారులు

నమస్తే ఎఫెక్ట్

మేడ్చల్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలం అంకిరెడ్డిపల్లిలో ఉన్న సాల్వో ఇండస్ట్రీస్ అక్రమ నిర్మాణాలు, మైనింగ్ పనులు ప్రభుత్వ భూముల కబ్జాలపై గ్రామస్తులు చేస్తున్న ఫిర్యాదుల మేరకు బార్డర్ ఇష్యూ తేల్చాలని డిప్యూటీ డైరెక్టర్ సర్వే ల్యాండ్‌కు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని తెలుస్తున్నది. దర్జాగా కబ్జా..అక్రమ నిర్మాణాలు, మైనింగ్ పనుల వ్యవహారంపై 'నమస్తే'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈక్రమంలో సాల్వో ఇండస్ట్రీస్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూముల కబ్జాలపై విచారణకు అధికారులు సిద్ధమవుతున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. సాల్వో ఇండస్ట్రీస్‌కు సంబంధించిన భూముల విషయమై మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ డిప్యూటీ డైరెక్టర్ సర్వే ల్యాండ్ అధికారితో చర్చించి విచారణ చేసేలా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఉమ్మడి నల్గొండ జిల్లా రామలింగంపల్లి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అంకిరెడ్డిపల్లి గ్రామాల మధ్య బార్డర్ ఇష్యూ ఉంది. దీంతో ఇదే అదనుగా భావించి సాల్వో ఇండస్ట్రీస్.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సర్వే నంబర్ 886లో 19 ఎకరాలు, 887 సర్వే నంబర్‌లో 10 ఎకరాలు, 918 సర్వే నంబర్‌లో 295 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు, మైనింగ్ పనులు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నట్లు గ్రామస్తులు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అయితే ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోగా, బార్డర్ ఇష్యూ పేరిట అధికారులు సాల్వో ఇండస్ట్రీస్ పెద్దలకు అండగా నిలుస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపణలు చేస్తున్నారు. ఈ క్రమంలో సాల్వో ఇండస్ట్రీస్ ఉన్న రెండు గ్రామాల మధ్య బార్డర్ ఇష్యూను తేల్చేలని ఇచ్చిన ఆదేశాలను తేల్చేలా డిప్యూటీ డైరెక్టర్ సర్వే ల్యాండ్ అధికారితో కీసర ఆర్డీవో, కీసర తహసీల్దార్లు ఉండి బార్డర్ ఇష్యూను తేల్చాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

### కాలయాపన చేసేందుకేనా..

గతంలోనే రామలింగపల్లి, అంకిరెడ్డిపల్లి మధ్య బార్డర్ ఇష్యూపై డిప్యూటీ డైరెక్టర్ ల్యాండ్ సర్వే అధికారులు సర్వే చేశారు. అయితే సర్వేకు సంబంధించిన నివేదికలు ఉన్నతాధికారుల వద్దే ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న నివేదికలు కాకుండా మరోసారి సర్వే చేయాలని ఎందుకు ఆదేశించారో అంతు చిక్కని ప్రశ్నగా కనపడుతుంది. సాల్వో ఇండస్ట్రీస్‌కు మద్దతుగా ఉండి కాలయాపన చేసేందుకే తిరిగి బార్డర్ ఇష్యూ పేరిట సర్వే చేయనున్నారా...? అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 918, 886, 887 సర్వే నంబర్లలో 325 ఎకరాలు ప్రభుత్వ భూమికి సంబంధించిందని 1954 నుంచి 2024 వరకు సెత్వారు, కాస్రా ఆన్‌లైన్ రికార్డుల్లో అంకిరెడ్డిపల్లికి చెందిన ప్రభుత్వ భూమి అని రికార్డుల్లో స్పష్టంగా ఉన్నా.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్‌లు చేస్తూ రెండు చెరువులు కబ్జాకు గురైనట్లు ఆరోపణలొస్తున్నాయి. అయితే సాల్వో ఇండస్ట్రీస్ యాజమాన్యానికి సీఎం కార్యాలయంలోని ఓ వ్యక్తి మద్దతుగా నిలుస్తుండటం వల్లే తాము ఎన్ని ఫిర్యాదులు చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# 1930నీ వదలట్లే!

### టోల్‌ఫ్రీ నంబర్‌నూ వాడేస్తున్న సైబర్ చీటర్స్

### బాధితులకు అనుమానమొస్తే.. 1930 నంబర్‌కు మేమే కలుపుతామంటున్న ఆగంతకులు

### మరొకరికి నంబర్ కలిపి..

### సైబర్ పోలీసులమంటూ.. వివరాల సేకరణ

### కొత్త రూట్‌లో బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఆగంతకులు

సిటీబ్యూరో, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): సీబీఐ, ఈడీ పేర్లతో పాటు సైబర్ నేరగాళ్లు బాధితులను భయపెట్టించడంలో 1930 నంబర్‌ను కూడా వాడుతూ అమాయకులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. సైబర్ నేరాలు జరిగితే వెంటనే 1930కు ఫోన్ చేయాలని కేంద్రం సైబర్ బాధితుల కోసం ఈ టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. సైబర్‌నేరాలపై ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. అయితే సైబర్‌నేరగాళ్లు ఈ నంబర్‌ను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటూ మోసాలకు పాల్పడుతున్నారు. ఎక్కువగా డిజిటల్ అరెస్ట్‌లలో ఈ నంబర్‌ను నేరగాళ్లు వాడుతున్నారు. మోసమని అనుమానం వచ్చి సైబర్ పోలీసులకు చెబుతామంటూ.. బాధితులు చెబితే, ఆగండి 1930 నంబర్‌కు నేనే కలుపుతున్నానంటూ ఫోన్ నంబర్‌ను మరొకరికి కలిపి 'సైబర్ పోలీసులం' చెప్పండి అంటూ వివరాలు సైతం తీసుకుంటున్నారు.

### ఎవరికీ చెప్పకోవాలనే ఆలోచన..

'ఫెడెక్స్ కొరియర్, ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నాం..మీ ఫోన్ రెండు గంటల్లో బ్లాక్ అవుతుంది.. మేం సీబీఐ, ఈడీ నుంచి మాట్లాడుతున్నామం'టూ సైబర్‌నేరగాళ్లు ఫోన్ చేస్తారు. ఇలా ఫోన్ చేయగానే మీ ఫోన్ నంబర్, ఆధార్ కార్డుతో భారీగా లావాదేవీలు జరిగాయి.. మనీ లాండరింగ్ కేసుతో ఈ నంబర్లకు సంబంధాలున్నాయి.. కేసు నమోదయ్యిందంటూ మాట్లాడుతారు. దీనికి సంబంధించిన విచారణ చేయాలి..మేం పోలీసులమంటూ పోలీసు దుస్తులతో వచ్చి బాధితులను డిజిటల్ అరెస్ట్ చేస్తారు. బాధితులతో కొంత సేపు ఆప్యాయతగా, మరికొంత సేపు భయపెడుతూ మాట్లాడుతారు. ఇలా సహాయం చేసేందుకు మేమే ఉన్నామని బాధితుల్లో ఒక నమ్మకాన్ని కుదిర్చి ఆ తరువాత బ్యాంకు ఖాతాలను లూటీ చేస్తారు. ఇందులో ఎవరికైనా అనుమానం వచ్చి మేం సైబర్‌క్రైమ్ పోలీసులకు చెబుతాం, 1930కి ఫోన్ చేస్తామంటూ ఎవరైనా సైబర్ నేరగాళ్లతో మాట్లాడితే మీరు చెప్పడం ఎందుకు.. ఇప్పుడే సైబర్‌క్రైమ్ వాళ్లను లైన్లోకి తీసుకుందామంటూ వాళ్లే సైబర్ పోలీసులమంటూ మాట్లాడుతారు. ఇలా కొత్త రూట్లో సైబర్ నేరగాళ్లు బాధితులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు.




### బాధితులు జాగ్రత్త..

సైబర్‌నేరాల్లో మోసపోయిన వారి గురించి.. మోసగాళ్లకు తెలిసి ఉంటుంది. మోసపోయిన తరువాత 1930కు బాధితులు ఫోన్ చేస్తారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సైబర్ నేరగాళ్లు మోసం చేసిన తరువాత కొన్ని రోజులకు బాధితులకు తిరిగి ఫోన్ చేసే అవకాశాలుంటాయి. మేం 1930 నుంచి మాట్లాడుతున్నామంటూ చెప్పి, ఏదో సహాయం చేస్తామంటూ నమ్మించి మోసం చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. గతంలో ఫిర్యాదు చేసి ఉండడంతో బాధితులు నిజమనే నమ్మకం కూడా ఉంటుంది. ఎవరు ఫోన్ చేసినా ఆర్థిక పరమైన అంశాలు, డబ్బు డిపాజిట్ చేయమన్నారంటే అది మోసమని గుర్తించాలని సైబర్‌క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.

# ఇంట్లో ఎలుకలున్నాయని ఇంటిని సీజ్ చేసుకుంటామా?

## మేయర్ ఆదేశాలను తప్పుబట్టిన ఎమ్మెల్సీ బేగ్

## చికెన్ మార్కెట్ సీజ్‌ను అడ్డుకున్న ఎంఐఎం నేతలు

సిటీబ్యూరో: 'కలుషిత, అపరిశుభ్రమైన, నాణ్యత లేని నాన్‌వెజ్ విక్రయాలు జరుపుతూ చికెన్ మార్కెట్ నిర్వాహకులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. భరించలేని దుర్వాసన, ఎలుకల సంచారం.. తక్షణమే చికెన్ మార్కెట్‌ను సీజ్ చేయండి'.. ఈ నెల 22న కోఠిలోని మోతీ మార్కెట్‌లో ఆకస్మిక పర్యటన సందర్భంగా మేయర్ అధికారులకు చేసిన ఆదేశాలివి.. మేయర్ ఆదేశాల మేరకు చికెన్ సెంటర్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి సీజ్ చేసే ప్రయత్నం చేశారు. ఇది గడిచి 24 గంటలు గడవక ముందే ఎంఐఎం పార్టీకి చెందిన ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్ సీజ్ చేసిన చికెన్, మటన్ షాపులు తెరవకపోతే ఉద్యోగాలు పోతాయంటూ ఫుడ్ సేఫ్టీ అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఇంకోసారి తమ దుకాణాలపై దాడులు చేస్తే చర్యలు తప్పవంటూ మందలించారు. మేయర్ ఆదేశాలు డోంట్ కేర్..ఇంట్లో ఎలుకలు ఉన్నాయని, ఇంటిని సీజ్ చేసుకుంటామా? అంటూ ఎమ్మెల్సీ బేగ్ మేయర్ తనిఖీల తీరును ఎండగట్టారు. ప్రస్తుతం యధేచ్ఛగా మోతీ మార్కెట్‌లో చికెన్ వ్యాపారాలు కొనసాగుతున్నాయి. మేయర్ వర్సెస్ ఎంఐఎం ఎమ్మెల్సీ వ్యవహారం జీహెచ్ఎంసీలో హాట్ టాఫిక్ అంశంగా మారింది. మేయర్ తీరుపై ఎంఐఎం ప్రజాప్రతినిధులు గుర్రుగా ఉన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో ఎంఐఎం పార్టీకి చెందిన నాయకుడి క్యాంటీన్ విషయంలోనూ మేయర్ తరచూ జోక్యం చేసుకుంటున్నారన్న చర్చ జరుగుతున్న క్రమంలో ఎమ్మెల్సీ బేగ్ మేయర్ ఆదేశాలకు ధీటుగా నిలబడి విమర్శలు గుప్పిస్తుండడంపై అటు అధికారుల్లో, ఇటు కార్పొరేటర్లలో విస్తృతంగా చర్చ జరుగుతున్నది.

### తనిఖీల వెనుక ఆంతర్యమేమిటీ

ఇటీవల కాలంలో మేయర్ తనిఖీలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. అటు జీహెచ్ఎంసీ కార్యాలయంలో, ఇటు పలు జోన్ల పర్యటనలలో ఆకస్మిక పర్యటనలు టార్గెట్‌గా జరుగుతున్నాయని చర్చ మొదలైంది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో విభాగాల వారీగా ఆకస్మిక పర్యటనలు చేసి సమయానికి విధులు హాజరు కావడం లేదని సిబ్బందిపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఫీల్డ్ తనిఖీలు ఉంటాయని, మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటారు. కానీ మేయర్ ఈ విషయం తెలిసినా.. సెలక్టెడ్ అధికారులే టార్గెట్‌గా మందలించడంపై పలువురు అధికారులు విస్మయం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే ఆహార నాణ్యత నిబంధనలు ఉల్లంఘించిన హోటళ్లు, రెస్టారెంట్లపై తనిఖీలు అధికార పార్టీ, ఇటు ఎంఐఎం పార్టీల్లో హాట్ హాట్ చర్చ జరుగుతున్నది. లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో మేయర్ హల్ చేశారు. ఓ కార్పొరేటర్, మరో ఎంపీకి చెందిన హోటళ్లలో పర్యటించడం వెనుక అంతర్యమేమిటన్న ప్రశ్నలు వినిపించాయి. మోతీ మార్కెట్‌లోని చికెన్ సెంటర్‌లో తనిఖీ చేశారు. అపరిశుభ్రమైన వాతావరణంలో వ్యాపారం జరుగుతున్నదని, ఎలుకలు సంచరిస్తున్నాయని గుర్తించి అధికారులకు చర్యలు తీసుకోవాలని మేయర్ ఆదేశించడం, ఎంఐఎం ఎమ్మెల్సీ మేయర్ ఆదేశాలు డోంట్‌కేర్ అంటూ వ్యాపారాలను తిరిగి యధేచ్ఛగా చేసుకునేలా చేయడం చర్చనీయాంశమైంది.

### ప్రొటోకాల్ ఉల్లంఘనను అరికట్టండి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పలువురు కార్పొరేటర్లు కలిసి ప్రొటోకాల్ ఉల్లంఘన అరికట్టాలని విన్నవించారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే ప్రతి అభివృద్ధి పని ప్రారంభోత్సవంలో అధికారులు ప్రొటోకాల్‌కు విరుద్ధంగా జరుపుతున్నారని మల్కాజ్‌గిరి నియోజకవర్గ బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్‌కు వివరించారు. స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం తెలియకుండా పనులు మొదలు పెడుతున్నారని, అధికార పార్టీ నాయకుల అండతో అధికారులు పనిచేస్తున్నారని, ఈ విషయాన్ని అధికారులు బాహాటంగానే రాజకీయ ఒత్తిడి ఉందని ఒప్పుకుంటున్నారని కార్పొరేటర్లు తెలిపారు. సదరు అధికారులపై శాఖపరమైన, క్రమశిక్షణ చర్యలు మున్సిపాలిటీ యాక్ట్ ప్రకారం సెక్షన్ 153, 154, 155 ప్రకారం చర్యలు తీసుకోవాలని ఈ మేరకు మేయర్‌కు కార్పొరేటర్లు వినతిపత్రం సమర్పించారు.

# మంత్రి వచ్చేదాకా చెక్కులివ్వరా?

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఆలస్యమెందుకు?

### కూకట్‌పల్లిలో 534 చెక్కుల పంపిణీ పెండింగ్..

### నెల రోజులుగా మంత్రి పేరుతో కాలయాపన..

### నేడు పంపిణీ చేయకుంటే ఆందోళనకు సిద్ధం

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరిక

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయడానికి.. జిల్లా మంత్రి సమయం ఇవ్వడం లేదంటూ.. తహసీల్దార్ కాలయపన చేయడం తగదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. లబ్ధిదారులకు వెంటనే చెక్కులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో మాట్లాడుతూ...కూకట్‌పల్లి నియోజకవర్గంలో 534 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంజూరవ్వగా, నెల రోజులుగా వాటిని పంపిణీ చేయడం లేదని, లబ్ధిదారులు ఇంటికి వచ్చి ఆ చెక్కులను ఇప్పించాలని కోరుతున్నారని, తహసీల్దార్‌కు ఎన్నిసార్లు విన్నవించినా మంత్రి సమయం ఇవ్వడం లేదని, కాలయాపన చేస్తున్నారన్నారు. పేద ప్రజలు అప్పులు చేసి ఆడబిడ్డల పెండ్లి చేస్తారని, వారికి సకాలంలో ప్రభుత్వ సాయం అందిస్తే బాగుంటుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో కుల, మత, ప్రాంతీయ బేధం లేకుండా అందరికీ లక్ష రూపాయల సాయం చేశామని, కూకట్‌పల్లిలో నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు భోజనం పెట్టి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు.



### చెక్కుల పంపిణీలో రాజకీయమా?

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో రాజకీయాలు చేయడం తగదని, మంత్రులే చెక్కులను పంపిణీ చేయాలనుకుంటే తనను పిలవకుండానే చెక్కులను పంపిణీ చేసినా అభ్యంతరం లేదన్నారు. పేదలకు మేలు చేకూర్చడమే ధ్యేయమైనప్పుడు ఎవరు పంపిణీ చేస్తే ఏమిటీ నష్టమని ప్రశ్నించారు. పేదలకు మంజూరైన చెక్కులను మంత్రి పేరుతో నెల రోజులుగా పంపిణీ చేయకుండా కాలయపన చేయడం సమంజసం కాదన్నారు. ఆన్‌లైన్ స్టేటస్‌లో ఎమ్మెల్యే వద్ద చెక్కులు పెండింగ్‌లో ఉన్నట్లు చూపడంతో అనేక మంది తమ కార్యాలయానికి వచ్చి వెళ్తున్నారని, అయితే అవి తహసీల్దార్ కార్యాలయంలోనే నెలల తరబడి మూలుగుతున్నాయన్నారు. చెక్కుల పంపిణీలో కూడా రాజకీయాలు చూడటం, మంత్రివర్యులు సమయం ఇవ్వకపోవడం మంచి పద్ధతి కాదన్నారు.

### 24 గంటల డెడ్‌లైన్..

నెల రోజులుగా చెక్కులను పంపిణీ చేయాలని అధికారులను కోరినప్పటికీ పంపిణీ చేయకుండా లబ్ధిదారులను చుట్టూ తిప్పుకోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం 11 గంటల వరకు చెక్కుల పంపిణీ చేయకపోతే తాను తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తానని హెచ్చరించారు. నిరుపేదలు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి... ఆడబిడ్డ పెండ్లి చేస్తారని, ప్రభుత్వం ఇచ్చే లక్ష రూపాయల ఆర్థిక సాయం వారి కష్టాలను తీర్చుతుందన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న బల్దియా కమిషనర్ ఇలంబర్తి

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

## అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆదేశం

సిటీబ్యూరో, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల సమస్యలను అడుగుతూ అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంపై ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా మూడు విన్నపాలు రాగా, పరిష్కారానికై ఆయా విభాగాలకు పంపించారు. ప్రధాన కార్యాలయంలో 46 విన్నపాలు రాగా, టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 21, ఎఫ్ఏ హెల్త్ విభాగాలకు 5 చొప్పున, ఎలక్ట్రికల్ విభాగానికి 4, స్పోర్ట్స్, సీఈ మెయింటనెన్స్, ఎస్టేట్, ఎల్‌డబ్ల్యూస్, హౌసింగ్ విభాగాలకు రెండు చొప్పున, విజిలెన్స్ విభాగానికి ఒక్క ఫిర్యాదును స్వీకరించారు. ఇక ఆరు జోన్లలో 80 అర్జీలను స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కూకట్‌పల్లి జోన్‌లో 33, శేరిలింగంపల్లిలో 9, ఎల్బీనగర్‌లో 14, సికింద్రాబాద్‌లో 21, చార్మినార్‌లో మూడు, ఖైరతాబాద్‌లో ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు.

# ఆటో డ్రైవర్లు చస్తుంటే.. విజయోత్సవమా?

### తెలంగాణ రాష్ట్ర ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ

సిటీబ్యూరో, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఆటో డ్రైవర్లు చస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం విజయోత్సవం జరుపుకొంటున్నదని తెలంగాణ రాష్ట్ర ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైవర్ల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి చోద్యం చూస్తున్నదని విమర్శించారు. ఆటో డ్రైవర్లతో డిసెంబర్‌లో చర్చలు జరపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్ర ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు రవిశంకర్, సమ్మయ్య యాదవ్ మాట్లాడుతూ.. కేంద్రం పెంచిన రవాణా వాహనాల ఇన్సూరెన్స్ 50 శాతం తగ్గించాలని డిమాండ్ చేశారు. నగరంలోకి గూడ్స్ వాహనాల అనుమతి సమయం పెంచాలని, వన్ నేషన్, వన్ టాక్స్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారులపై ప్రభుత్వ చెక్‌పోస్ట్‌లు ఎత్తివేయాలని కోరారు. ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతీస్తున్న రెడ్ అంబులెన్స్, గూడ్స్ వాహనాల ఉపాధి దెబ్బతీస్తున్న పోర్టర్ కంపెనీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిషేధించాలన్నారు.




నిరసన తెలుపుతున్న తెలంగాణ రాష్ట్ర ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ నేతలు